క్లుప్తంగా

అన్నా క్యాంటీన్ పనుల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సీతారామపురం అన్న క్యాంటీన్ ఆధునికీకరణ పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదేశించారు. స్థానిక నేతలతో కలిసి శనివారం ఆయన అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



అన్నవరం(జగ్గయ్యపేట): మండలంలోని అన్నవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షసప్తహ కార్యక్రమంలో భాగంగా శనివారం పోషణా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కూరగాయలు, పప్పుధాన్యాలు, కోడిగుడ్లు తింటే కలిగే ఉపయోగాలను వివరించారు. ఆకుకూరలు, చిరుధాన్యాల ద్వారా శరీరానికి విటమిన్లు అధికంగా లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందన్, శ్రీనివాసరావు, శ్రీదేవి, విజయలక్ష్మి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



వత్సవాయి : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. బావులు, బోర్ల కింద ఉన్న మాగాణి పొలాలను ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్నారు. వరినారు కూడా సిద్ధంగా ఉండటంతో పొలాలు తయారైన రైతులు వెంటనే నాట్లు వేస్తున్నారు. వాతావరణం నాట్లకు అనుకూలంగా ఉండటంతో రైతులు పొలాలను తయారుచేసుకుని వేరే ప్రాంతాల నుంచి నారును తీసుకువచ్చి నాట్లు కొనసాగిస్తున్నారు. మునేటికి కింద ఉన్న మాగాణి భూముల్లో ఎక్కువగా నాట్లు వేస్తున్నారు.

ఎంఈవోకు వినతిపత్రం అందజేత



జుజ్జూరు(వీరులపాడు): రాజకీయ కారణాలతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను తొలగించడం బాధాకరమని యూనియన్ అధ్యక్షురాలు పుల్లమ్మ అన్నారు. మండలంలో విధుల నుంచి తొలగించిన ఏజెన్సీ నిర్వాహకులను తిరిగి తీసుకోవాలని కోరుతూ ఎంఈవో పాల్కొనడీకి యూనియన్ తరఫున శనివారం ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లమ్మ మాట్లాడుతూ 20ఏళ్లుగా పని చేస్తున్న వారిని రాజకీయ కారణాలతో తొలగించడం నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఏళ్ల తరబడి చేస్తున్న కార్మికుల పొట్టకొట్టేలా రాజకీయ నాయకులు వ్యవహరిస్తుండటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బహుభాషా గాయని చిత్ర

విజయవాడ కల్చరల్: బహుభాషా గాయని చిత్ర అని సింధూ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకురాలు జాస్తి కృష్ణ సింధూ అన్నారు. సింధూ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం సినీ గాయని చిత్ర జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ.. చిత్రగా పరిచయమైన కేఎస్ చిత్ర మాతృభాష మళయాళమైనప్పటికి తెలుగులో అనేక వందల చిత్ర గీతాలను ఆలపించారన్నారు. గాయకుడు వడ్లమూడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దర్శకుడు ఎస్కే బాజీ, సినీగాయని ప్రియ, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఉమా బలరాం చిత్ర సినీ జీవిత విశేషాలను వివరించారు. సినీ సంగీత విభావరిలో దేవిడ్రాజు, ఆదిరాల జయప్రభు, రామభద్ర కుమార్, పావని, సుహాసిని, ప్రవీణ్, బాల పృథ్వీరాజ్ తదితరులు చిత్ర ఆలపించిన చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను సత్కరించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం

నందిగామ టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక చైతన్య కళాశాల విద్యార్థులకు 'ర్యాగింగ్-డ్రగ్స్-సైబర్ నేరాల నివారణ'పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జడ్జి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుంటే జీవితాలు అంధకారమవుతాయన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కష్టపడి చదవడం ద్వారానే జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐ పండుదొర మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్లకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వరాదన్నారు. అప్రమత్తంగా ఉండటం ద్వారానే సైబర్ నేరాల బారినపడకుండా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ విజయ్, న్యాయవాదులు మౌలేశ్వరరావు, ఆజాద్, హనుమంతరావు, వెంకటరత్నం, మండల న్యాయ సేవాధికారసంస్థ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి, సిబ్బంది

గంజాయి రహిత సమాజమే లక్ష్యం

జగ్గయ్యపేట అర్బన్: గంజాయి రహిత జగ్గయ్యపేట లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా కృషి చేద్దామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ ఎస్.మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గంజాయి రహిత జగ్గయ్యపేట లక్ష్యంగా ఎస్ఈబీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 100 రోజుల కార్యాచరణను శనివారం ప్రజలకు వివరించారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. గంజాయి కారణంగా జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాబోయే 100 రోజుల్లో గంజాయి రహిత జగ్గయ్యపేట కోసం తీసుకోనున్న చర్యలను వివరించారు. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి తీసుకుంటే కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే సెల్‌నంబరు 9440902461కు తెలియజేయాలని కోరారు. సమాచారం తెలియజేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వివరించారు. అనంతరం పలు కూడళ్లలో బస్సులు, ఆటోలు తదితర వాహనాలకు గంజాయి నిర్మూలనకు పాటించాల్సిన చర్యలను వివరిస్తూ స్టిక్కర్లను అంటించారు.

కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే తాతయ్య



పేటలో అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని కలాం విగ్రహానికి ఎమ్మెల్యే తాతయ్య స్థానిక నేతలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రపతిగా, క్షిపణి శాస్త్రవేత్తగా దేశం గర్వించే సేవలను అబ్దుల్ కలాం అందించారని కొనియాడారు. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన అతి సామాన్య కుటుంబానికి చెందిన అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు...

నందిగామ టౌన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపించారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కొనియాడారు. పట్టణంలోని ఆమె నివాసంలో కలాం వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టుదల, సంకల్పం ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చన్నారు. దేశ అణు, శాస్త్రీయ రంగాలకు సరికొత్త మార్గనిర్దేశనం చూపిన దార్శనికులని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, నాయకులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

దేశం గర్వించదగిన గొప్ప వ్యక్తుల్లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం ముందు వరుసలో ఉంటారని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తగా కలాం దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ ఆజాద్, హనుమంతరావు, దాదాహుసేన్, మౌలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



పెండ్యాలలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు

పెండ్యాల(కంచికచర్ల): బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమా పేర్కొన్నారు. మండలంలోని పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కరీమా మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన అమ్మాయికి, 19ఏళ్లు నిండిన అబ్బాయికి వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, అటువంటి చర్యలకు పాల్పడినవారు శిక్షార్హులన్నారు. చిన్న వయస్సులో పెళ్లిచేస్తే వారి ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కట్టా కిరణ్‌కుమారి, రాణి, స్కూల్ హెచ్‌ఎం డి.శ్రీను, హెల్త్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ చేయాలి...



అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లక్ష్మీభార్గవి

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని గర్భిణులకు పోషకాహార కిట్లు అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా సంపూర్ణ అభియాన్ కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్క్‌షాప్‌లు, ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులందరికీ నూరుశాతం పౌష్టికాహార కిట్లు పంపిణీ జరగాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారి పి.ఇందిర, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం(ఏబీపీ) అధికారి మోహన్ సందీప్ మాట్లాడుతూ ప్రతి హెల్త్ సెంటర్‌లో గర్భిణులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఏబీపీ మోహన్ సందీప్

29న హుండీ లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలోని కానుకల హుండీ లెక్కింపును ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఈవో హేమలతాదేవి శనివారం తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ హుండీ లెక్కింపులో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

చిన్నమోదుగపల్లిలో చోరీ

రూ.లక్ష నగదు, బంగారం అపహరణ

చిన్నమోదుగపల్లి(వత్సవాయి): గ్రామానికి చెందిన కట్టా తిరుపతయ్య ఇంట్లో దొంగలు పడి రూ.లక్ష నగదుతోపాటు రూ.లక్ష విలువగల బంగారం వెండి దొంగిలించిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కట్టా తిరుపతయ్య ఇటీవల అనారోగ్యానికి గురై విజవాయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. చికిత్స ముగించుకుని తిరిగి శనివారం సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తలుపులు పగలుగొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే తలుపులు తెరిచి చూడగా ఇంట్లోని బీరువాను పగలగొట్టి అందులోని లక్ష నగదు, రూ.లక్ష విలువ చేసే బంగారం, వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బి.అభిమన్యు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎడ్యునో రోబట్స్ ఐటీటీ సంస్థ సౌజన్యంతో 15 రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు పట్టు సాధించాలని కళాశాల చైర్మన్ చలవాది మల్లికార్జునరావు సూచించారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టైలర్‌పేట తిరుమలయ్యవీధికి చెందిన గుడుపూడి సునీత, నారాయణ ప్రేమ వివాహం చేసుకున్నారు. సునీత కొండపల్లిలోని కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుండగా, నారాయణ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటారు. గత కొంతకాలంగా నారాయణ మద్యానికి బానిసై భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురావాలని హింసించసాగాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పైరు ఎదుగుదలలో పొటాష్ కీలకం



కె.రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి

పెనుగంచిప్రోలు: పొటాష్ పోషకాన్ని మొక్కలు పొటాషియం రూపంలో తీసుకుంటాయి. పైరుకు పొటాషియం పోషకం తగినంత మోతాదులో అందినప్పుడు పైరు ఏపుగా, పంట నాణ్యంగా ఉంటుందని పెనుగంచిప్రోలు మండల వ్యవసాయాధికారి కె.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆయా పంటల సాగులో పొటాష్ అవసరం, వినియోగంలో పాటించాల్సిన మెలకువలు, ఉపయోగాలను ఆయన వివరించారు .

పొటాష్‌తో కలిగే లాభాలు...

పత్తి, మిర్చి, పసుపు, అల్లం, వేరుశెనగ, కొబ్బరి తదితర పైర్లు పొటాష్ అధికంగా తీసుకుంటాయి. మొక్కలలో జరిగే జీవ రసాయన క్రియలకు, ఆకుల్లో తయారైన పిండి పదార్థం, ఇతర భాగాలకు చేరేందుకు, ఎంజైముల తయారీలోనూ పొటాష్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పైరు తెగుళ్లకు లోనుకాకుండా చేస్తుంది. శాఖీయ భాగాలను, కాండాన్ని బలపరచి నేలపై వాలనీయదు. గింజకట్టు పూర్తిగా, బరువుగా ఉండి నాణ్యత పెరుగుతుంది. ప్రత్యేకించి పండ్లు, కూరగాయలు తదితర పంటలలో నాణ్యత పెరగటానికి పొటాష్ దోహదపడుతుంది. వర్షాభావ పరిస్థితులు, చలి వాతావరణం వంటి ప్రతికూల పరిస్థితులకు పైరు తట్టుకోవటానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

పొటాష్ లోపిస్తే....

పైరులో పొటాష్ లోపిస్తే ఆకుల అంచులు ఆకుపచ్చని రంగు నుంచి పసుపు రంగులోకి మారి ఎండిపోతాయి. ఆకు మొనలు గోధుమరంగుగా మారి దిగువ భాగానికి విస్తరిస్తుంది. పెరుగుదల నెమ్మదిగా ఉండి గిడసబారిపోతుంది. కాండం బలంగా ఉండక సులభంగా వాలిపోతుంది. త్వరితంగా చీడ, పీడలకు గురవుతుంది. తద్వారా పంట నాణ్యత, దిగుబడి తగ్గిపోతుంది. పండ్లు, కూరగాయల్లో రంగు, రుచి, వాసన రవాణాలో నిల్వ ఉండే గుణం బాగా క్షీణిస్తుంది.

వినియోగంలో జాగ్రత్తలు అవసరం..

పైర్లకు పొటాష్ పోషకాన్ని మ్యూరేట్ ఆఫ్ పొటాష్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ వంటి సూటి ఎరువుల ద్వారా గాని, పొటాష్ ఉన్న కాంప్లెక్స్ ఎరువుల ద్వారా గాని పైర్లకు అందించవచ్చు. మ్యూరేట్ ఆఫ్ పొటాష్(పొటాషియం క్లోరైడ్)ఎరువు నీటిలో పూర్తిగా కరుగుతుంది. ఇందులో 60శాతం పొటాష్, 40 శాతం క్లోరైడ్ ఉంటుంది. సాధారణంగా ఇది తెల్లని స్ఫటికాలుగా ఉంటుంది. ముడి పదార్థం లభించిన ప్రదేశాన్ని బట్టి ఎరుపు, తెలుపు కలిపిన చిన్న పలుకులుగా ఉండవచ్చు. ఇది అన్ని రకాల నేలలకు సాధారణ పైర్లకు వేసుకోవచ్చు. క్లోరైడ్ కారణంగా నాణ్యత దెబ్బతినే పొగాకు, బంగాళదుంప వంటి పైర్లకు వేయరాదు. సల్ఫేట్ ఆఫ్ పొటాష్(పొటాషియం సల్ఫేట్)లో 50 శాతం పొటాష్‌తో పాటు 18 శాతం గంధకం కూడా ఉంటుంది. ఇది నీటిలో పూర్తిగా కరుగుతుంది. ఇది అన్ని రకాల పైర్లకు వాడుకోవచ్చు. కానీ దీని ధర మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కన్నా ఎక్కువగా ఉంటుంది. నాణ్యత కోసం పొగాకు, బంగాళదుంప, నిమ్మ, ద్రాక్ష, అరటి మిర్చి పైర్లకు వేసుకోవచ్చు. పొటాష్ ఎరువులను మెట్ట పైర్లలో ఒకసారి, మాగాణి ఆరుతడి పైర్లలో రెండు సార్లుగా విభజించి భూసార పరీక్షలు అనుసరించి వేసుకోవాలి.



పొలంలో పొటాష్ చల్లుతున్న రైతు

మార్కెట్‌లో లభిస్తున్న పొటాష్ ఎరువులు....

మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (60 శాతం), సల్ఫేట్ ఆఫ్ పొటాష్(50 శాతం), 15-15-15(15 శాతం), 14-35-14(14 శాతం), 12-32-16(16 శాతం), 10-26-26(26 శాతం), 17-17-17(17 శాతం), 19-19-19(19 శాతం), 14-28-14(14శాతం).

ముందస్తు టీకాలతో పశువుల్లో వ్యాధులకు చెక్



కంచికచర్లలో ఎద్దుకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి విజయ్

కంచికచర్ల : వర్షాకాలం నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు, పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట ప్రాంతమైన నందిగామ నియోజకవర్గంలో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. పంటసాగులో నష్టమొచ్చినా కరువు కాటకాలొచ్చినా కలిగే లోటును పశుపోషకులు, పాడి పరిశ్రమతో పూడ్చుకుంటుంటారు.

అలాంటి కీలక ఆధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు.

పాడిరైతులు నష్టపోకుండా..

వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు అధికంగా సోకే ప్రమాదముందని పశువైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధులు ఆగస్టు, సెప్టెంబర్ నెల చివరి వరకు వర్షాలు పడే సమయంలో అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గటంతోపాటు పశువులు మృతిచెందే ప్రమాదం కూడా ఉంటుంది. దీంతో పాడి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, మేత కారణంగా పశువుల్లో రోగనిరోధక శక్తి తగ్గి పలు వ్యాధులు సంక్రమిస్తాయి. దీంతో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

కంచికచర్ల మండలంలో....

కంచికచర్ల మండలంలోని 16 గ్రామాల్లో రైతులు ఎక్కువ మంది పాడి పరిశ్రమపై ఆధారపడి ఉన్నారు. మండలంలోని కంచికచర్ల, మోగులూరు, గండేపల్లి, వేములపల్లి పరిటాల, గొట్టుముక్కల పశువైద్యశాలల ఆధ్వర్యంలో ఆవులు 700, ఎద్దులు 300, గేదెలు 10,300, గొర్రెలు 16, 800, మేకలు 3,300లు ఉన్నాయని మండల పశువైద్యాధికారి విజయ్ తెలిపారు.



మోగులూరులో గొర్రెలు, మేకలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

టీకాలు తప్పనిసరి....

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. పాల దిగుబడి తగ్గిపోతుందని కొందరు రైతులు పశువులకు టీకాలు వేయించేందుకు వెనకడుగు వేస్తుంటారు. టీకాలు వేయటంతో పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఒక అపోహ మాత్రమేనని, అలాంటిదేమీ జరగదని పశువైద్యులు చెబుతున్నారు. వ్యాధులు ముదిరి పశువులను కోల్పోవడం కంటే, ముందస్తు టీకాలు వేయిస్తే పశువులు వ్యాధుల బారినపడకుండా నివారించవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు.

గొంతువాపు అంటువ్యాధే...

వర్షాకాలంలో ప్రధానంగా పశువులకు గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీనినే గురక వ్యాధి అని కూడా అంటారు. గేదెలు, ఆవులు దూడల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకలకు కూడా వ్యాపిస్తుంటుంది. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కక్కుతూ గురక, శ్వాస పీల్చటం కష్టమవుతుంది. జ్వరం తీవ్రత 107 డిగ్రీల వరకు ఉండి, గొంతు కిందికి నీరు దిగి గొంతువాపు వస్తుంది. ఈ వ్యాధి సోకిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

గాలికుంటు వ్యాధితో తీవ్ర జ్వరం....

గాలికుంటు వ్యాధి తల్లిపాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి, గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి సోకుతుంది. జ్వరం తీవ్రత 105 డిగ్రీల వరకు ఉండి నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు నడవలేని స్థితికి చేరుకుని మేత తీసుకోలేక నీరసిస్తాయి. ఈ వ్యాధుల వ్యాప్తిపై పశువులు, జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముందస్తు టీకాలు వేయించాలి..



ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పాడి రైతులు పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇప్పటికే గ్రామాల్లో పశువులు, జీవాలకు టీకాలు వేస్తున్నాం. పాడి రైతులు పశువులకు ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచిది.

– విశ్వనాథపల్లి విజయ్, మండల పశువైద్యాధికారి, కంచికచర్ల

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె తెస్తున్న ముండ్లపాడు మహిళలు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన మహిళలు శనివారం పెద్దసంఖ్యలో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారికి సారె సమర్పించి బోనాలు చెల్లించారు. వీరికి ఆలయం అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు. సారె తెచ్చిన మహిళలకు ఆలయ వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. మహిళలు ముండ్లపాడు నుంచి భాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలతో ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

శాకంబరీదేవిగా మరతక రాజేశ్వరి

పటమట(విజయవాడ తూర్పు): పటమటలోని దత్త పీఠంలో కొలువుతీరిన శ్రీ మరకత రాజరాజేశ్వరి అమ్మవారు శాకంబరీ దేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మరకత రాజ రాజేశ్వరి అమ్మవారికి పలు రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.